ఉష్ణోగ్రత : గరిష్టం 37.9 కనిష్టం 9.7

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:30 (శుక్రవారం సాయంత్రం)

సహర్: 5:08 (శనివారం ఉదయం)

రిజర్వేషన్ల కేటాయింపు శాస్త్రీయంగా జరగాలి

» ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ మద్దిలేటి మాదిగ



చేవెళ్ల మండల కేంద్రంలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే ఎస్సీ వర్గీకరణ చట్టంలో అన్ని కులాలకు రిజర్వేషన్ల కేటాయింపు శాస్త్రీయంగా జరిగేలా చూడాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ మద్దిలేటి మాదిగ తెలిపారు. గురువారం చేవెళ్లలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... 11వ తేదీన చేవెళ్లలో నిర్వహించే జిల్లా మాదిగ దండోరా మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు శంకర్‌రావు మాదిగ, ప్రవీణ్, శివ శంకర్, నాని, భానుప్రసాద్, విజయ్‌కుమార్, రమేశ్, రాములు, అనంతరాములు, మల్లేష్ తదితరులు ఉన్నారు.

జిల్లాలో నేడు

పంటల సాగుపై అవగాహన సమావేశం

యాచారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలంలోని రైతులతో ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు శుక్రవారం సమావేశం కానున్నట్లు రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతువేదికలో జరిగే ఈ కార్యక్రమంలో సాగు, సస్యరక్షణ చర్యలు, పంటల మార్పిడి విధానం, ఎరువుల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు.



రికార్డులను పరిశీలిస్తున్న నర్సింహారావు

ఎరువుల కొరత లేకుండా చర్యలు

» జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

కందుకూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): యాసంగిలో రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులు, సహకార సంఘం కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగుకు అనుగుణంగా యూరియా, డీఏపీ, 2020 ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. కందుకూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 96 టన్నులు, ఫర్టిలైజర్స్ షాపుల్లో 90 టన్నుల యూరియాను అందుబాటులో ఉందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని ఫర్టిలైజర్స్ దుకాణ యజమానులను హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య, సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్, సీఈవో యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంది పంట దగ్ధం

- ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడలో బూడిదైన మూడున్నర ఎకరాల చేను
- రైతుకు రూ.1.5లక్షల మేర నష్టం

7

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకున్నాయి. మార్చి నెలలోనే భానుడు నిప్పులు కక్కుతుండటంతో నీటి మట్టాలు ఒక్కసారిగా పడిపోయాయి. యాసంగి సీజన్‌లో వర్షాలు కురవకపోవడం తోపాటు నీటి వినియోగం పెరిగిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఒక్క నెలలో అత్యధికంగా సరూర్‌నగర్ మండలంలో 4.02 మీటర్ల లోతులోకి భూగర్భజలాలు పడిపోవడం గమనార్హం. వేసవిలో సాగు నీరేమో గానీ తాగు నీరు కూడా దొరకడం కష్టమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.



పాతాళానికి భూగర్భజలాలు

వేగంగా తగ్గుతున్న నీటిమట్టాలు

- మూడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి
- సరూర్‌నగర్‌లో అత్యధికంగా 18.33 మీటర్ల లోతులోకి
- మేడ్చల్ జిల్లాలో ఒక్క నెలలో 2.11 మీటర్లు తగ్గిన నీటిమట్టం
- యాసంగి పంటలపై తీవ్ర ప్రభావం
- తాగు నీటికీ తప్పని కష్టాలు

భూగర్భజలాల పరిస్థితి (మీటర్లలో..)

జిల్లా	జనవరి	ఫిబ్రవరి	వ్యత్యాసం
రంగారెడ్డి	10.13	11.22	-1.09
మేడ్చల్	11.21	13.32	-2.11
వికారాబాద్	12.29	13.67	-1.38

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఈ వేసవిలో ఉమ్మడి జిల్లా నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ భూగర్భజలాలు గణనీయంగా పడిపోతుండడమే ఇందుకు కారణం. యాసంగి సీజన్‌లో దాదాపు 40శాతం లోటు వర్షపాతం నమోదు కావడంతో పాటు విచ్చలవిడి నీటి వినియోగం కారణంగా శరవేగంగా నీటి నిల్వలు పడిపోతున్నాయి. జనవరి నెలాఖరుతో పోలిస్తే ఫిబ్రవరి నెలాఖరు నాటికి మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 2.11 మీటర్ల లోతుకు నీటి మట్టాలు పడిపోయాయి. అలాగే వికారాబాద్ జిల్లాలో 1.38 మీటర్లు, రంగారెడ్డి జిల్లాలో 1.09 మీటర్ల వరకు భూగర్భజలాలు తగ్గాయి. గడిచిన మూడు నెలలుగా గణనీయంగా భూగర్భనీటి మట్టాలు పడిపోతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ ఏడాది మార్చి ఆరంభంలోనే

మిగతా 7వ పేజీలో...

ఒక్కనెలలో నాలుగు మీటర్ల లోతుకు

గత జనవరి నెలతో పోలిస్తే జిల్లాలోని 27 మండలాల్లో భూగర్భజలాలు పడిపోయాయి. ఒక్క నెలలో అత్యధికంగా సరూర్‌నగర్ మండలంలో 4.02 మీటర్ల భూగర్భజలాలు పడిపోవడం గమనార్హం. అలాగే మంచాల మండలంలో 1.87 మీటర్లు, కొందుర్గు మండలంలో 1.60 మీటర్లు, శంకరపల్లిలో 1.54 మీటర్లు నీటి మట్టాలు తగ్గాయి. సరూర్‌నగర్ మండలం బహదూర్‌గూడలో 35.79మీటర్ల లోతుకు భూగర్భజలాలు పతనమయ్యాయి.

కేశంపేట విద్యార్థి మృతదేహం 'తానా'కు అప్పగింత

» స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు

» కొడుకు మృతదేహం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు



ప్రవీణ్(ఫైల్)

కేశంపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని మిల్వాకీలో దుండగుల కాల్పుల్లో మృతి చెందిన తెలంగాణ విద్యార్థి గంప ప్రవీణ్ మృతదేహాన్ని అమెరికాలోని ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా)కు అప్పగించినట్లు మృతుడి తండ్రి గంప రాఘవులు గురువారం వెల్లడించారు. తానా సభ్యులు మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 4న మిల్వాకీలో దుండగుల కాల్పుల్లో కేశంపేట మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్ మృతి చెందిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రవీణ్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్ రప్పించేందుకు అమెరికా విదేశంగా మంత్రిత్వశాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ త్వరలోనే ప్రవీణ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొడుకు మృతదేహం కోసం ప్రవీణ్ తల్లితండ్రులు రాఘువులు, రమ కన్నీటితో ఎదురుచూస్తున్నారు. రెండు రోజులుగా కుమారుడి కోసం తల్లి రమ రోదిస్తున్న తీరు అందరినీ కలచివేస్తోంది. కాగా, ప్రవీణ్ కుటుంబాన్ని ప్రజా ప్రతినిధులు పరామర్శించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

» ప్రవీణ్ హత్య బాధాకరం

» మృతుని కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించిన మాజీ మంత్రి కేటీఆర్

అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లిన తెలంగాణ విద్యార్థి గంప ప్రవీణ్‌ను దుండగులు కాల్చి చంపడం అమానుషమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధైర్యపడొద్దని తాము అండగా ఉంటామని గురువారం సాయంత్రం అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతి చెందిన కేశంపేట మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్ తలిదండ్రులు గంప రాఘవులు, రమాదేవి దంపతులకు ఫోన్ చేసి తన సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన కేశంపేట మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ ఫోన్ ద్వారా సంప్రదించి వారితో మాట్లాడుతూ ఉన్నత చదువులకు వెళ్లి అమెరికాలో గంప ప్రవీణ్ దుండగుల కాల్పుల్లో మృతి చెందడం చాల బాధకరమన్నారు. వీలైనంత త్వరగా మృతదేహాన్ని భారత్‌కు రప్పించేందుకు అమెరికాలోని భారత రాయభార కార్యాలయం అధికారులతో మాట్లాడుతామని కేటీఆర్ తెలిపారు.



చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు

98.2 శాతం

ఇంటర్ సెకండియర్ పరీక్షలకు విద్యార్థుల హాజరు

రంగారెడ్డి అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులు ముందస్తుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అధికారులు ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 185 పరీక్ష కేంద్రాల్లో 71,684 మంది విద్యార్థులకు గాను 70,431 మంది హాజరయ్యారు. 1,253 మంది గైర్హాజరయ్యారు. 31 ప్రశ్న పత్రాల స్టోరేజీ పాయింట్ల నుంచి పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో తరలించారు. ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ విధుల్లో పాల్గొన్నారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారి, అలాగే 145 మంది అసిస్టెంట్ డిపార్టుమెంట్ అధికారులు విధులు నిర్వర్తించారు. పరీక్షల్లో కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ పనిచేశాయి. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించలేదు. కేంద్రాల సమీపంలో జిరాక్స్ దుకాణాలు, కంప్యూటర్ సెంటర్లు మూసివేయించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపించారు.

హాజరు వివరాలు

	జనరల్	ఒకేషనల్	మొత్తం
విద్యార్థులు	68,561	3,123	71,684
హాజరు	67,409	3,022	70,431
గైర్హాజరు	1,152	101	1,253

వైభవంగా రథోత్సవం

కడ్తాల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చరికొండలోని వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున రథోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఉంచిన రథాన్ని భక్తులు తాళ్లతో లాగారు. అర్చకుడు చక్రవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకం, లంకా దహనం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, నర్సింహాగౌడ్, లక్ష్మయ్య, నాయకులు జంగయ్య, బల్వంతరెడ్డి, భీష్మాచారి, వేణుగోపాల్, యాదయ్య పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

కేసీఆర్‌లా మాట తప్పం

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తాం.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌లా తాము మాట తప్పమని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి షాద్‌నగర్ ప్రాంత వ్యవసాయ భూములను సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో, ఆ తరువాత ప్రతీ ఎన్నికల్లో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పేరుతో లబ్ధిపొందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధికారంలోకి రాగానే దానిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. కనీసం భూసేకరణ కూడా చేయకుండా నిర్లక్ష్యం చేసిన మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లు పాలమూరు ఎత్తిపోతల పథకం గురించి గొప్పలు చెప్పుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. ఈ పథకం డిజైన్‌ను మార్చి ఆరు రిజర్వాయర్లకు గాను ఐదు రిజర్వాయర్ల నిర్మాణాలు చేపట్టి, ఒక ఎకరానికైనా సాగునీరు అందించారా అని ప్రశ్నించారు. ఐదు రిజర్వాయర్ పనులను కూడా పూర్తి చేయలేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయడానికి సీఎం రేవంత్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. అనంతరం నందిగామ మండలంలోని 33 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

ప్రవీణ్ కుటుంబానికి అండగా ఉంటాం

అమెరికాలో దుండగుల కాల్పుల్లో మరణించిన గంప ప్రవీణ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఉన్నత చదువు కోసం వెళ్లిన కేశంపేట వాసి గంప ప్రవీణ్ దుండగుల కాల్పుల్లో చనిపోవడం బాధాకరమన్నారు. రెండు రోజుల్లో ప్రవీణ్ మృతదేహం స్వస్థలానికి రప్పించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గంప ప్రవీణ్ కుటుంబాన్ని పరామర్శించి, మనోధైర్యం చెప్పామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా కార్యక్రమాలలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జి. బాల్‌రాజ్‌గౌడ్, పి. వెంకట్‌రాంరెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, చిట్టెం దామోదర్‌రెడ్డి, జంగ నర్సింహ్మా, రఘునాయక్, ప్రియాంక, హరినాథ్ రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, రాంరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

'ఫార్మా' బాధితులకు ఇంటి స్థలం చూపాలి



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాంచందర్

కందుకూరు, మార్చి6(ఆంధ్రజ్యోతి) : కందుకూరు, యాచారం మండలాల్లో ఫార్మాసిటీ భూబాధితులకు గత, ప్రస్తుత ప్రభుత్వాలు చేసిందేమీలేదని, వారికి కేటాయించిన 121 గజాల ఇంటి స్థలాన్ని వెంటనే చూపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్ డిమాండ్ చేశారు. ఆకులమైలారంలో ఆ పార్టీ నాయకులు గురువారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావొస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. నిరుపేదలకు ఇంటి స్థలం, తెల్లరేషన్ కార్డు, పెన్షన్‌పెంపు, ఉచిత విద్యుత్ అమలులో సీఎం రేవంత్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఆకులమైలారంలో మురుగు సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శికి ఫోన్ ద్వారా తెలిపారు. ఎన్.నరసింహ, గండు మహేందర్, అచ్చన్న శివయ్య, రవీందర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

పరిగి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని పరిగి ఎంపీడీవో ఎంఏ కరీం అన్నారు. సాలివ్పలిబాటతండాలో గురువారం ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరు మస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డు ఉండి పని అడిగిన ప్రతీ కూలీకి పనికల్పించాలని సిబ్బందికి సూచించారు. కూలి అడిగిన ప్రతీ వ్యక్తికి పనికల్పించాలని సూచించారు. పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టీఏ ప్రభాకర్‌గౌడ్, ఎఫ్ఏ ఎల్లప్ప పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్


ఇంటి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, సిబ్బంది

ఘట్‌కేసర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఇంటి పన్నుల వసూళ్లకు అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో 12,500 ఇళ్లు ఉన్నాయి. పాత బకాయిలు రూ.3.64కోట్లు, ప్రస్తుత మొత్తం 9.71కోట్ల పన్నులు రావాల్సి ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారులు, బిల్‌కలెక్టర్లు, సిబ్బంది ట్యాక్స్ వసూళ్లపై దృష్టి కేంద్రీకరించారు. మొండి బకాయిదారులు ట్యాక్సులు చెల్లించని వారి ఇళ్ల డ్రైనేజీలను, నల్లా కనెక్షన్లను తొలగిస్తున్నారు. దీంతో చాలామంది పన్నులు చెల్లిస్తున్నారు. ఘట్‌కేసర్‌లో ఇప్పటి వరకు 45.41శాతం పన్నులు వసూలు చేశారు. స్పెషల్ డ్రైవ్ కొనసాగనుంది.

నైపుణ్యాల వెలికితీతకు సైన్స్ ఫెయిర్ దోహదం


ఎగ్జిబిట్లు ప్రదర్శించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మోమిన్‌పేట్, మార్చి6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సైన్స్‌ఫెయిర్‌లు దోహదపడుతాయని ప్రధానోపాధ్యాయుడు అశోక్ అన్నారు. గురువారం కోల్కుంద జెడ్పీ పాఠశాలలో జాతీయ సైన్స్ ఫెయిర్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. వారిని టీచర్లు అభినందించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

విద్యార్థినులను ఇబ్బందిపెట్టొద్దు


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేయొద్దని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. బాలికలు, ఉపాధ్యాయినుతో మాట్లాడారు. బాలికలకు ఎలుకలు కరిచిన విషయంపై ఆరా తీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గీతరాథోడ్‌సింగ్, ప్యాక్స్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు ఖదీర్, నర్సింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

కడ్తాలతో అంబలి కేంద్రం ఏర్పాటు


బాటసారులకు అంబలి పంపిణీ చేస్తున్న బిక్యానాయక్

కడ్తాల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్ అన్నారు. కడ్తాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాగి అంబలి కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేశ్‌లతో కలిసి బాటసారులు, ప్రయాణికులకు అంబలిని పంపిణీ చేశారు. వేసవి నేపథ్యంలో చలివేంద్రాలు, అంబలి కేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, దాతలు ముందుకురావాలని కోరారు. కడ్తాలలో యేటా అంబలి కేంద్రాన్ని నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్‌ను ఆయన అభినందించారు. రాంచందర్, జహంగీర్, కృష్ణ పాల్గొన్నారు.

నకిలీ మందు విక్రయంపై రైతు ఫిర్యాదు


పైరును పరిశీలిస్తున్న ఏవో శిరీష, ఏఈవోలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల పరిధిలోని లేమామిడికి చెందిన రైతు శ్రీధర్‌రెడ్డి తన సాగు చేస్తున్న మొక్కజొన్న పైరులో కలుపు మందు పిచికారి చేశాడు. అయితే మందు ప్రభావంతో పంట మొక్కలు ఎండుతున్నాయని రైతు మండల వ్యవసాధికారి(ఏవో) శిరీషకు గురువారం ఫిర్యాదు చేశాడు. తాను కేశంపేటలోని గ్రోమోర్ సెంటర్ నుంచి కలుపుమందు తెచ్చి మందు స్ప్రే చేశానని తెలిపాడు. స్ప్రే చేసిన తరువాత మొక్కజొన్న పైరు ఎండిపోతోందన్నాడు. స్పందించిన ఎంఏవో.. ఏఈవోలు సుధ, నిఖిల్‌లతో మొక్కజొన్న చేనును పరిశీలించారు. పంట ఎండిపోతోందని, అయితే వ్యవసాయ శాస్త్రవేత్తలు వొచ్చి పరిశీలించిన తరువాతే పంట చనిపోవడానికి గల కారణాలను నిర్ధారిస్తారని తెలిపారు. చేను వద్దకు శాస్త్రవేత్తలను రప్పించేందుకు ఉన్నతాధికారులకు లేఖ రాస్తానన్నారు. వారి వెంట పాండురంగారెడ్డి ఉన్నారు.

పురాతన ఆలయాలను పునరుద్ధరిస్తాం

తలకొండపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలోని పురాతన ఆలయాలను పునరుద్ధరించి పునర్వైభవాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆలయాలు, పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం పర్యాటక శాఖ ద్వారా నియోజకవర్గానికి రూ.5కోట్లు మంజూరు చేసిందన్నారు. పడకల్ గ్రామ నాయకులతో గురువారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ నెల 13 నుంచి 20 వరకు కొనసాగే పడకల్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు ఎమ్మెల్యేకు అందజేశారు. దైవ కార్యక్రమాల్లో ప్రతొక్కరూ పాలుపంచుకోవాలని కసిరెడ్డి అన్నారు. నాయకులు శంకర్, భిక్షపతి, మల్లేశ్, కుమార్ పాల్గొన్నారు. అలాగే బ్రహ్మోత్సవాలకు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, టాస్క్ సీఈవో రాఘవేందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు తల్లోజు ఆచారి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పల వెంకటేశ్‌లకు ఆహ్వానాలను అందజేశారు.


ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

పాతాళానికి భూగర్భజలాలు

(ఐదో పేజీ తరువాయి)

ఎండలు దారెత్తిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయి నీటి ఇక్కట్లు మొదలయ్యాయి. ముఖ్యంగా నగర శివార్లలో భూగర్భ జలాలు అధఃపాతాళానికి పడిపోయాయి. సాగునీటి సంగతి ఏమోకానీ తాగునీటికి కూడా ఇబ్బందులు వస్తున్నాయి. సరూర్‌నగర్ మండలంలో అత్యధికంగా 18.33 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. అలాగే 23శాతం ప్రాంతాల్లో 15 మీటర్లలోతుకు సగటు భూగర్భజలాలు అడుగంటాయి. నవంబర్ నుంచి దాదాపు ప్రతినెలా సగటు మీటర్‌కుపైగా భూగర్భజలాలు తరిగిపోతున్నాయి. ఫిబ్రవరిలో మరింత శరవేగంగా భూగర్భజలాలు తరిగిపోతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దాదాపు యాసంగి సీజన్ ముగియడంతో భవిష్యత్‌లో వర్షాలు పడే అవకాశం లేదు. దీంతో తాగు, సాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నగర శివార్లలో పరిస్థితి దారుణంగా కనిపిస్తోంది. సరూర్‌నగర్, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో భూగర్భనీటి నిల్వలు శరవేగంగా పడిపోతున్నాయి. శివార్లలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. ఇప్పటికే తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రజలు నీటి ట్యాంకర్లు కొనుగోలు చేస్తున్నారు. మరో వైపు నీటి ఎద్దడి కారణంగా యాసంగి పంటలకు ఇబ్బందులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. యాసంగి సీజన్‌లో వర్షాలు లేకపోవడం వల్ల పంటల సాగుపై ప్రభావం పడింది. ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో వానాకాలం 30శాతానికిపైగా అధిక వర్షపాతం నమోదైంది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భూగర్భజలాలు గణనీయంగానే పెరిగాయి. అయితే తరువాత మూడు జిల్లాల్లో యాసంగి సీజన్‌లో కనీస స్థాయిలో కూడా వర్షాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు లోటు వర్షపాతంతో పాటు మరోవైపు విచ్చలవిడిగా నీటి వాడకం పెరగడంతో భూగర్భజలాలు శరవేగంగా పడిపోతున్నాయి. యాసంగిలో రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు సగటున 128.2 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, 77.5మి.మీ వర్షపాతమే నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లాలో 129.6 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 80.3మి.మీ వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లాలో 104.9మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 94మి.మీ వర్షం పడింది. దీంతో పంటపొలాలకు బోర్ల ద్వారా నీటి వాడకం గణనీయంగా పెరిగింది. కొన్నిచోట్ల ఇప్పుడే బోర్లు ఎండిపోతున్నాయి. మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

సరూర్‌నగర్‌లో అత్యధికంగా ...

ఉమ్మడి జిల్లాలో సరూర్‌నగర్ మండలంలో అత్యధికంగా భూగర్భజలాలు పడిపోయాయి. ఇక్కడ సగటు 18.33 మీటర్ల లోతుకు భూగర్భజలాలు అడుగంటాయి. అలాగే ఇబ్రహీంపట్నం మండలంలో 16.89 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. శేరిలింగంపల్లి మండలంలో 15.07 మీటర్లు, మంచాల 13.83 మీటర్లు, తలకొండపల్లి మండలంలో 13.52 మీటర్లు, హయత్‌నగర్ మండలంలో 13.07 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పతనమయ్యాయి.



కల్యాణతంతు నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా లక్ష్మీనారసింహుడి కల్యాణం

రంగారెడ్డి అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండలం బైర్ఖాన్‌పల్లిలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీనరసింహుల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. పండితులు నరసింహ శర్మ, చిదంబరంశర్మ, వెంకటదత్తశర్మ, రామశర్మ, దత్తాత్రేయశర్మ, విశ్వశర్మ కల్యాణ తంతు జరిపించారు. అంతకు ముందు స్వామి వారల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మండపానికి తీసొచ్చారు. అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు. వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాఘవేందర్‌రావు, రూప్లానాయక్, కృష్ణయ్య, నాయకులు అంజయ్య, వెంకటయ్య, యాదగిరిరావు, యాదగిరి, కుమార్, ద్రోణాచారి, యాదగిరిచారి, పరుషోత్తమచారి, జగదీశ్వరచారి, భక్తులు పాల్గొన్నారు.

మాలలను దోషులుగా చిత్రీకరించొద్దు



చేవెళ్లలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ముసుగులో మాలలను ద్రోహులుగా, దోషులుగా చిత్రీకరించటం సరికాదని రంగారెడ్డి జిల్లా మాల సంఘాల జేఏసీ నాయకుడు, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల మల్లేశ్, మాల మహానాడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. గురువారం చేవెళ్లలో జిల్లా మాల సంఘాల జేఏసీ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ త్యాగాలు, పోరాటాల ద్వారా వచ్చిన రిజర్వేషన్లను అందిపుచ్చుకోవడమే తప్పు చేసినట్లుగా ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చేవెళ్లలో చేసిన ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను 18శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. మాలల్లోని మేధావులు, రాజకీయ నాయకులు, ఉద్యమకారులు మాలల అస్తిత్వానికి పోరాడాలని కోరారు. సమావేశంలో నాయకులు మల్లెపల్లి శ్రీనివాస్, సత్యం, బురాన్ మహేశ్, బేగరి సంజీవ, తదితరులు ఉన్నారు.

చౌడాపూర్ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శరభలింగం

చౌడాపూర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ గ్రామానికి చెందిన శరభలింగం డాక్టరేట్ అందుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట్ పీహెచ్‌సీలో హెల్త్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శరభలింగం సామాజిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు అవార్డులు అందుకున్నారు. గురువారం ప్రపంచ సాంస్కృతిక, పర్యావరణ పరిరక్షణ కమిషన్ న్యూఢిల్లీ వారు గౌరవ డాక్టరేట్ అందించారు. కరోనా కాలంలో ప్రజలను చైతన్యపర్చడం, యువజన సంఘాలతో యువతలో చైతన్యం కల్గించడం, మూఢనమ్మకాలను నిర్మూలించడం తదితరాంశాలపై చైతన్యపర్చారు. తన సేవలను గుర్తించి డాక్టరేట్ ఇవ్వడంపై శరభలింగం సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ది ఎర్త్ సెంటర్‌లో కన్పించిన పాలరాతి కప్ప



కడ్తాల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్మాస్‌పల్లిలో గల 'ది ఎర్త్ సెంటర్' జీవవైవిధ్యానికి నిలయంగా మారింది. అరుదైన జీవులు, మొక్కలు ఇక్కడ ప్రసిద్ధి. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు జీవరాసుల ఉనికికి తోడ్పడుతున్నాయి. గురువారం ఎర్త్ సెంటర్‌లో పాలరాతి బుడగల కప్ప కన్పించింది. కప్ప జాతిలో ఇది అరుదైందని సీజీఆర్ ప్రతినిధి, జంతుశాస్త్ర విద్యార్థి జ్ఞానేశ్వర్ తెలిపారు. వేసవిలో నెలపాటు భూ అంతర్భాగంలో సుప్తావస్థలో ఈ కప్ప ఉంటుందని చెప్పారు. ఎర్త్ సెంటర్‌లో అరుదైన కప్ప కన్పించడంపై సీజీఆర్ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

మహిళా సంఘాలకు ... సోలార్ ప్లాంట్లు

- బషీరాబాద్, కోట్‌పల్లి మండలాల్లో యూనిట్ల ఏర్పాటు
- రూ.3కోట్లతో సౌర విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణం
- యూనిట్‌కు ఐదెకరాలు గుర్తింపు
- పీఎం-కుసుమ్ స్కీం కింద ప్లాంట్ల శ్రీకారానికి రాష్ట్ర ప్రభుత్వం చేయూత



సౌర విద్యుత్ ప్లాంట్ నమూనా

బషీరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాలు వారు సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తోంది. పైలట్ ప్రాజెక్ట్‌గా వికారాబాద్ జిల్లా బషీరాబాద్, కోట్‌పల్లి మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. బషీరాబాద్ మండలం ఆమర్చెడ్ వద్ద 11కేవీ సబ్‌స్టేషన్ సమీపంలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఐదెకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు అప్పగించారు. కోట్‌పల్లి మండలం బర్వాద్‌లోనూ స్థలాన్ని గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం ఈ భూములను డీపీఎం రాంమూర్తి, సోలార్ ప్రాజెక్ట్ మేనేజర్లు, సర్వేయర్లు పరిశీలించి డీపీఆర్‌ను అందజేశారు.



దామర్‌చెడ్ వద్ద సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పీఎం కుసుమ్ స్కీంతో ముందుకు

థర్మల్ విద్యుదుత్పత్తిని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం సోలార్ పవర్ ప్లాంట్లను ప్రోత్సహిస్తోంది. ఇందుకు 'పీఎం కుసుమ్' పథకాన్ని తెచ్చింది. మహిళా సంఘాలకు ఆదాయమార్గాన్ని చూపేందుకు ప్రభుత్వం సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఊతమిస్తోంది. ప్రభుత్వ మహిళా సంఘాలతో సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయించి, నిర్వహణ బాధ్యతలను సమీప రెండు గ్రామాల సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలో రెండు యూనిట్లు

రాష్ట్రంలో వెయ్యి మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లు నెలకొల్పాలనేది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(రెడ్కో) బషీరాబాద్, కోట్‌పల్లిల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ఎంపిక చేసింది. ఈ మండలాల్లో ఒక్కో మెగావాట్ సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేస్తారు. ఒక్కో ప్లాంట్‌కు 4 నుంచి 5ఎకరాల స్థలం అవసరం. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను పంపిణీ చేసేందుకు ఇప్పటికే ఉన్న సబ్‌స్టేషన్‌కు 5కిలోమీటర్లలోపు ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. వీటి నిర్వహణా బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించేందుకు డీఆర్డీఏ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్క మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.3కోట్ల అవుతుందని, ఇందులో 90శాతం బ్యాంక్ రుణం ఇస్తుందని, 10శాతం నిధులను మహిళా సంఘాలు తమ వాటాగా సమకూర్చుకుంటారని అధికారులు చెబుతున్నారు. భూమిని 25ఏళ్ల కాలపరిమితితో ప్రభుత్వం ఉచితంగా కేటాయిస్తుంది. ఈ క్రమంలో 15ఏళ్లలో నిర్మాణ వ్యయం చేతికంది, పదేళ్లు మహిళా సంఘాలకు ఆదాయం సమకూరుతుంది. సోలార్ ప్లాంట్ల విద్యుత్‌ను డిస్కంలకు విక్రయిస్తారు. తక్కువ వ్యయం, సులభ నిర్వహణ అయ్యే సోలార్ విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పి మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

యూనిట్ల ఏర్పాటుకు సంయుక్త సర్వే

ప్రభుత్వ భూములను సర్వేచేసి నివేదికిచ్చిన తర్వాత యూనిట్ల ఏర్పాటులో సాంకేతిక సమస్యలు రాకుండా ప్రభుత్వం సంయుక్త సర్వేకు ఆదేశాలు జారీ చేయనుంది. తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ట్రాన్స్‌కో అధికారులు, రెవెన్యూ అధికారులు వీలైతే టీఎస్ రెడ్కో అధికారులు సంయుక్త పరిశీలన సర్వే చేసి ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశించింది.

ప్లాంట్ ఏర్పాటుకు స్థలం గుర్తించాం



పీఎం కుసుమ్ పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్‌తో కలిసి దామర్‌చెడ్ వద్ద స్థలాన్ని ఎంపిక చేశాం. స్థల పరిశీలనానంతరం డీపీఆర్‌ను ప్రభుత్వానికి పంపారు. అనుమతులొచ్చాక ప్లాంట్ నిర్మాణం ప్రారంభం అవుతుంది.

పద్మారావు, ఐకేపీ ఏపీఎం, బషీరాబాద్



కేంద్ర మంత్రి పాటిల్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంపీ రాజేందర్

మురుగు నీటి నిర్వహణకు నిధులు కేటాయించండి

మేడ్చల్ టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మురుగు నీటి నిర్వహణ కోసం నిధులు కేటాయించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ గురువారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్.పాటిల్‌కు వినతిపత్రం ఇచ్చారు. తన పార్లమెంట్ నియోజకవర్గంలో మురుగు నీటి నిర్వహణకు రూ.133కోట్లు విడుదల చేయాలని కోరుతూ ఎంపీ ఈటల నివేదిక సమర్పించారు. తన నియోజకవర్గంలో ఉన్న మూసీ మురుగు నీటి శుద్ధి, పలు ప్రాంతాల్లో కలుషితమైతున్న జల వనరుల సంరక్షణకు నిధులు కేటాయించి సహకరించాలని కోరారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం చాలా భాగం హైదరాబాద్‌లోనే ఉన్నందున స్థానికంగా మురుగునీటి సమస్య, కొన్ని ప్రాంతాల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఎంపీ ఈటల కేంద్రమంత్రికి వివరించారు. లోక్‌సభ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చేపట్టాల్సిన పనులపై వివరాలను సమర్పించారు. ఎంపీ వినతిపై కేంద్రం మంత్రి సానుకూలంగా స్పందించినట్లు బీజేపీ నాలయకులు తెలిపారు.

కంది పంట దగ్ధం

- బూడిదైన మూడున్నర ఎకరాల చేను
- రైతుకు రూ.1.5లక్షల మేర నష్టం



బూడిదైన కంది పంట

షాద్‌నగర్ రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశత్తు కంది పంటకు నిప్పంటుకొని మూడున్నర ఎకరాల మేర పంట కాలి బూడిదైంది. వివరాలిలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడకు చెందిన పాపయ్యయాదవ్ తన మూడున్నర ఎకరాల్లో కంది సాగు చేశాడు. కోతకు రావడంతో గురువారం ఇద్దరు కూలీలు పంట కోస్తున్నారు. కూలీలు ఓ పక్క పంట కోస్తుండగా పక్క పొలం రైతు తన పొలంలో చెత్తను కాల్చేందుకు నిప్పుపెట్టాడు. అతడి నిర్లక్ష్యంతో మంటలు పక్క పొలంలోని కంది చేనుకు వ్యపించాయి. కొద్ది నిమిషాల్లోనే మంటలు పంటంతా వ్యాపించాయి. రైతులు మంటలార్పే ప్రయత్నం చేసినా ఎండకు ఎగిసి పడ్డాయి. కంది చేను మొత్తం కాలి బూడిదైంది. పంట దగ్ధంతో తనకు రూ.1.5లక్షల నష్టం వాటిల్లిందని రైతు పాపయ్య తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



దగ్ధమవుతున్న కంది చేను

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

ఆదిభట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. ఆదిభట్ల పరిధి ఏవీఎన్ ఇంజినీరింగ్ కాలేజీలో రుద్రసంధాన్ 2కే25 జాతీయ స్థాయి సాంకేతిక, క్రీడా పోటీలను ప్రారంభించారు. పోటీల్లో వివిధ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, ఆవిష్కరణలను వెలికితీసేందుకు 2కే వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ప్రతిభ చూపే విద్యార్థులకు ఏటా స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామన్నారు. కాలేజి సెక్రటరీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు 2కే వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ ప్రదర్శనలను కనబర్చాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ అబ్దుల్ నబీ ఏవో సుధీర్‌రెడ్డి, సురేష్, జయరాం, రమేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోటీల నిర్వహణ అభినందనీయం



మొయినాబాద్ రూరల్: క్రీడాకారులతో గంగాధర్ మల్లేశ్, జంగపన్నగౌడ్

మొయినాబాద్ రూరల్: విద్యాసంస్థల్లో క్రీడలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల శక్తిసామర్థ్యం పెంచేందుకు అవకాశం ఉంటుందని, క్రీడా పోటీలు అభినందనీయమని ప్రో కబడ్డీ టీమ్ ఆటగాడు గంగాధర్ మల్లేశ్, ఇండియా వాలీబాల్ టీమ్ ఆటగాడు జంగపన్న గౌడ్ అన్నారు. అమ్డాపూర్ చౌరస్తాలో గల జేబీఐఈటీ కాలేజీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆరంభ్-25 పేరిట రెండు రోజులు నిర్వహించే క్రీడాపోటీలను గురువారం వారు ప్రారంభించారు. క్రీడా పోటీలతో విద్యార్థుల్లో స్నేహభావం ఏర్పడుతుందని, పోటీతత్వం పెంపొందుంతుందని చెప్పారు. జేబీ విద్యాసంస్థల కార్యదర్శి జేవీ.కృష్ణారావు, ప్రిన్సిపాల్ కృష్ణమాచారి, డైరెక్టర్ సంజయ్, డీన్లు కార్తికేయన్, సలవుద్దీన్, పీడీ విగ్నేష్, సంతోష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాలికలను చితకబాదిన పీఈటీ

కీసర, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆటలాడేందుకు రాలేదని వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థినులను చితకబాదిన ఘటన మేడ్చల్ జిల్లా కీసరలో గురువారం చోటుచేసుకుంది. బాలికల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 8మంది విద్యార్థినులు డ్రిల్ పీరియెడ్‌లో ఆటలాడేందుకు పోలేదు. దీంతో పీఈటీ ఆనంద్ వారిపై కోపం పెంచుకున్నాడు. డ్రిల్ పీరియెడ్‌లో ఓ ఉపాధ్యాయిని వారింట్లో జరిగిన ఓ శుభకార్యానికి సంబంధించిన ఫొటోలను ఫోన్‌లో ఆ బాలికలకు చూపిస్తున్నారు. ఇది చూసిన ఆనంద్ కోపంతో విచక్షణ కోల్పోయి విద్యార్థినులను కర్రతో చితకబాదాడు. బాలికలకు వీపుపై వాతలు తేలాయి. దీంతో బాలికల తల్లిదండ్రులు వ్యాయామ ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనంద్‌పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ ఘటనపై హెచ్‌ఎం శశిధర్ స్పందిస్తూ.. విద్యార్థినులను పీఈటీ చితకబాదిన విషయం తన దృష్టికి రాలేదని, వివరాలు తెలుసుకుంటానని చెప్పారు.



హ్యాకథాన్‌లో పాల్గొన్న వర్సిటీ విద్యార్థులు

హ్యాకథాన్‌లతో మేధాశక్తిని పెంచుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు హ్యాకథాన్‌లలో పాల్గొని మేధాశక్తిని పెంచుకోవాలని అనురాగ్ వర్సిటీ ఐటీ విభాగం హెచ్‌వోడీ సుధీర్‌రెడ్డి అన్నారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో గురువారం బీఐ పేరుతోని నిర్వహించిన 48గంటల హ్యాకథాన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తరచూ హ్యాకథాన్‌లు, టెక్నికల్ వర్క్‌షాప్‌లు, సదస్సుల్లో పాల్గొని మేధాశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. సృజనాత్మకత, సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంపొదించే వేదికలు హ్యాకథాన్‌లు అన్నారు. ఫైనాన్స్, బ్యాంకింగ్, రీటైల్, హెల్త్‌కేర్, స్పోర్ట్స్ తదితర డొమైన్ల నుంచి సమస్యా పూరణలు ఇచ్చారని, వీటిపై విద్యార్థులు మోడళ్లను అభివృద్ధి చేయాలని తెలిపారు. హ్యాకథాన్‌లో 17జట్లు పాల్గొన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున్‌రెడ్డి, బాలజీ ఊట్ల, విష్ణుచందన, వేణుగోపాల్, శాస్త్రి, మన్సూర్, మూర్తి, లక్ష్మి, రేణుక, విద్యార్థులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతివనం భూమిపై వివాదం

తాండూరు రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పల్లెప్రకృతి వనం భూమిపై వివాదం చోటుచేసుకుంది. గోపన్‌పల్లిలో పల్లె ప్రకృతివనం కోసం ప్రభుత్వ భూమి సర్వే నంబర్-6లో అధికారులు అరఎకరం కేటాయించారు. ఈ క్రమంలో పల్లె ప్రకృతి వనానికి కేటాయించిన భూమిలో ఓ వ్యక్తి జేసీబీతో చదును చేస్తున్నాడు. ఈ విషయమై ఆ వ్యక్తిని అడుగగా ఆ భూమి తన సోదరి భూమి అని, గతంలో అధికారులు అడిగితే ఇచ్చామన్నారు. ప్రస్తుతం వాడుకలో లేకపోవడంతో సాగుకు సిద్ధం చేస్తున్నామని తెలిపాడు.


వినతి పత్రం ఇస్తున్న వీర్లపల్లి శంకర్

రజక భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి

● సీఎస్‌కు ఎమ్మెల్యే శంకర్ వినతి

షాద్‌నగర్ అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రజక భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కోరుతూ వినతి పత్రాన్ని ఇచ్చినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గురువారం తెలిపారు. మేడిపల్లిలో కేటాయించిన స్థలం భవన నిర్మాణానికి అనుకూలంగా లేదని దానిని రద్దు చేసి, ఉప్పల్ భగాయత్‌లో స్థలాన్ని కేటాయించాలని కోరినట్లు పేర్కొన్నారు. రజక భవన నిర్మాణానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కళాశాల భవన నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం కోసం స్థానిక ఈశ్వర్ కాలనీకి చెందిన రియల్టర్ మంచిరేవుల అశోక్ రూ.50 వేల విరాళాన్ని ఇచ్చారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌ను కలిసి, విరాళం ఇచ్చిన అశోక్‌ను ఎమ్మెల్యే సన్మానించి, అభినందించారు. తాను కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివానని, ఎమ్మెల్యే పేదల కోసం భవనం నిర్మిస్తున్నందున తన వంతు ఉడతా భక్తిగా విరాళం ఇచ్చానని అశోక్ తెలిపారు.

● క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
● చల్లదనానికి ప్రజల తాపత్రయం
● ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలకు డిమాండ్
● మెకానిక్‌లకు చేతినిండా పని

ఎండల్లో.. చల్లగా.!

ఆమనగల్లు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎండలు మొదలయ్యాయి.. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగిపోతున్నాయి. భానుడి భగభగలు ప్రజలను భయపెడుతున్నాయి. ఏప్రిల్‌లో ఉండాల్సిన ఎండలు మార్చి మొదటి వారంలోనే ఉండడంతో మున్ముందు పరిస్థితి ఎలాం ఉంటుందోనని ప్రజలు ఆందోళనకు లోనవుతున్నారు. మండుతున్న ఎండలతో ఇళ్లలో ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండల ప్రతాపం, ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం జనం అనేక మార్గాలను వెతుక్కుంటున్నారు. చల్లదనం కోసం కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలు, ఫ్రిజ్‌ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఎండలు అధికంగా ఉన్నందున ఆమనగల్లు పట్టణంలో ఆయా విక్రయాలు ఊపందుకున్నాయి. గతంతో పోలిస్తే కూలర్ల విక్రయాలు పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. సామాన్యులు, పేదలు ఫ్యాన్లను కొనుగోలు చేస్తుంటే మధ్యతరగతి, ఉన్నత వర్గాలు కూలర్లు, ఏసీలపై ఆసక్తి చూపుతున్నారు. ఎండల నేపథ్యంలో ప్రధానంగా ఫ్యాన్లు, కూలర్లకు ఎనలేని డిమాండ్ పెరిగింది.


ఆమనగల్లులోని ఓ దుకాణంలో అమ్మకానికి ఉంచిన కూలర్లు

సరికొత్త డిజైన్లలో..

ప్రజల అభిరుచులు, మారుతున్న కాలానికనుగుణంగా మార్కెట్‌లోకి సరికొత్త డిజైన్లలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వస్తున్నాయి. అన్ని వర్గాలకు అనుగుణంగా కంపెనీలు వాటిని అందుబాటు ధరలలో మార్కెట్‌లోకి తెస్తున్నాయి. ప్లాస్టిక్, ఐరన్ కూలర్లు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. సాంకేతిక నైపుణ్యం ఉన్న కొంతమంది వ్యాపారులు కూలర్ల విడిభాగాలు పట్టణ ప్రాంతాల నుంచి తీసుకువచ్చి సొంతంగా తయారుచేసి విక్రయిస్తున్నారు. కంపెనీల మధ్యపోటీ కారణంగా సామాన్యులకు అందుబాటు ధరల్లో ఫ్యాన్లు, కూలర్లు లభ్యమవుతున్నాయి.

ఏసీలకు పెరుగుతున్న ఆదరణ

ఏసీలకు ఆదరణ పెరుగుతోంది. ఉపాధి మార్గాలు, ఆదాయ వనరులు ఉన్న కుటుంబాలు ఏసీలను కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఆమనగల్లు ప్రాంతంలో ఏసీలు దొరికేవి కావు. రాష్ట్ర రాజధానికి హైదరాబాద్‌కు వెళ్లి ఏ సంపన్నులో వాటిని కొనుగోలు చేసి తెచ్చుకునేవారు. ప్రస్తుతం గత రెండేళ్లుగా స్థానిక వ్యాపారులు మార్కెట్‌లో వివిధ కంపెనీలు, వివిధ మోడల్ ఏసీలను విక్రయిస్తున్నారు. ఫైనాన్స్ కంపెనీ లు కూడా సులభ వాయిదాల పద్ధతితో ఏసీల కొనుగోలుకు రుణాలు ఇస్తుండడం తో మధ్య తరగతి ప్రజలు ఏసీలు, బ్రాండెడ్ కూలర్ల వైపు మొగ్గు చూపుతున్నారు.

నాణ్యతను బట్టి ధరలు

ఏసీలు, ఫ్యాన్లు, కూలర్ల ధరలు కంపెనీ, నాణ్యతను బట్టి ఉన్నాయి. ఏసీలు రూ.30 వేల నుంచి రూ.60వేల వరకు, బ్రాండెడ్ కూలర్లు రూ.7వేల నుంచి 15 వేల వరకు, లోకల్ బ్రాండ్ కూలర్లు రూ.2500 నుంచి రూ.5వేల వరకు, ఫ్యాన్లు కంపెనీని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.3వేలకు లభిస్తున్నాయి. రిఫ్రిజిరేటర్లకు కూడా డిమాండ్ పెరిగింది. రూ.14 వేల నుంచి రూ.30 వేల వరకు స్థానికంగా లభ్యమవుతున్నాయి.

పెరిగిన విక్రయాలు

ఎండలు పెరుగుతుండటంతో కూలర్లు, ఏసీల విక్రయాలు పెరిగాయి. గతేడాది కంటే ఈసారి ధరలు 10 శాతం వరకు ధరలు పెరిగినట్లు వ్యాపారులు, కొనుగోలు దారులు పేర్కొంటున్నారు. మరో పక్షం రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. బ్రాండెండ్, లోకల్ కూలర్ల అమ్మకాలు ఊపందుకున్నాయి.

మెకానిక్‌లకు చేతినిండా పని

ఎండల నేపథ్యంలో ఫ్యాన్లు, కూలర్ల మెకానిక్‌లకు చేతినిండా పని లభిస్తోంది. ఏ దుకాణం వద్ద చూసినా మరమ్మతుకు వస్తున్న వివిధ వస్తువులు కుప్పలు, తెప్పలుగా పడి ఉంటున్నాయి. కొందరు ఇంట్లో ఉన్న కూలర్లకు కూడా మరమ్మతులు చేయించి వినియోగిస్తున్నారు. విడి భాగాలను వేస్తుండడంతో పేదలు వాటినే మరమ్మతు చేయించుకొని వినియోగిస్తున్నారు.

ఏసీలు కొనేందుకు మొగ్గుచూపుతున్నారు



వేసవి ఆరంభం లోనే ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల విక్రయాలకు డి మాండ్ పెరిగింది. పేదలు, సామాన్యులు ఫ్యాన్లు, మధ్యతరగతి, ఓ స్థాయి కుటుంబాలు కూలర్లపై ఆసక్తి కనబరుస్తున్నాయి. మూడేళ్లుగా ఏసీల విక్రయాలు కూడా పెరిగిగాయి. కంపెనీలను బట్టి అందుబాటు ధరలలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు లభిస్తున్నాయి.

- కోట రాజేశ్, వ్యాపారి, ఆమనగల్లు

క్రైం కార్నర్

ఐదు లక్షలు మంజూరయ్యాయని.. రూ.45,490 కాజేసిన కేటుగాడు

● ముద్ర ఫైనాన్స్ పేరిట సైబర్ నేరగాడి మోసం!

యాచారం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మీకు ముద్ర ఫైనాన్స్ నుంచి రూ.ఐదు లక్షలు మంజూరైనట్లు ఓ సైబర్ నేరగాడు యాచారం మండలంలోని గున్‌గల్ గ్రామానికి చెందిన రామన్నను మోసగించి రూ.45,490 కాజేసిన వైనం గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 4న ఉదయం 11 గంటలకు గుర్తుతెలియని దుండగుడు రామన్నకు ఫోన్‌చేసి మీకు ముద్ర ఫైనాన్స్‌లో రూ.5లక్షలు మంజూరయాయ్యి.. ఆ డబ్బు మీకు రావాలంటే ముందుగా మేం పంపిన ఫోన్‌పే స్కానర్‌కు రూ.45.490 పంపాలని చెప్పాడు. ఇది నిజమని నమ్మిన రామన్న విడతల వారీగా ఫోన్‌పే ద్వారా డబ్బు పంపించాడు. అయితే, తాను పంపిన డబ్బుకు రూ.5లక్షలు రాలేదని కుటుంబికులకు చెప్పగా ఇది సైబర్ నేరమని గమనించాడు. దాంతో గురువారం సాయంత్రం యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

రేషన్ దుకాణానికి సీల్

శంకర్‌పల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని ఫత్తేపురంలో రేషన్ దుకాణాన్ని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రవిందర్ నాయక్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలో ఉండాల్సిన దానికంటే ఎక్కువ స్టాక్ ఉందని అనుమానం రావడంతో ఆయన బియ్యాన్ని పూర్తి తూకం వేయమని డీలర్ యాదయ్యను కోరారు. బియ్యం తూకం వేసే వ్యక్తి అందుబాటులో లేడని, బంధువుల వద్దకు వెళ్లాడని డీలర్ సమాధానమిచ్చాడు. దాంతో డీటీ రేషన్ దుకాణానికి సీల్ వేశారు. ఆయనవెంట ఆర్ఐ తేజ ఉన్నారు. కాగా, నేడు(శుక్రవారం) ఉదయం బియ్యాన్ని తూకం వేయనున్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఇబ్రహీంపట్నం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లతోపాటు రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీపీఎం మున్సిపల్ కన్వీనర్ చింతపట్ల ఎల్లేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్, మహంకాళీ వీధిలో గురువారం సీపీఎం బృందం పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకుంది. ఏళ్ల తరబడిగా పేదలు ఇళ్ల స్థలాలకోసం ఎదురు చూస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదంటూ ఎల్లేష్ వాపోయారు. వేలాది ఎకరాలు కార్పొరేట్ సంస్థలకు కేటాయించారేగానీ.. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని అన్నారు. ఉపాధి హామీ పథకం కింద మున్సిపల్‌లో ఉన్న కూలీలకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు ముసలయ్య, వీరేశం, శివ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవతామూర్తులు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

● హాజరైన ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, నాయకులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నందిగామ మండల పరిధిలోని మోత్కుళ్లగూడలో దేవతామూర్తులు ఆంజనేయస్వామి, వినాయకుడు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను గురువారం వేద పండితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో మూడు రోజులుగా హోమాలు, యజ్ఞాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో వివిధ పార్టీల నాయకులు శివశంకర్‌గౌడ్, జిల్లెల్ల రాంరెడ్డి, జంగ నర్సింలు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, శంకరయ్య, నర్సింలు, కాట్న శ్రీశైలం, జెట్ట కుమార్, జెకె. న ర్సింలు, రవిందర్, శివచారి, బేగ్ ఇతరనాయకులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.


రంగారెడ్డి అర్బన్ : విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్, నాయకులు

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆమనగల్లు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వెంకటగిరి వేంకటేశ్వర స్వామి 125వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా, శోభాయామానంగా అలంకరించారు. కాగా, బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేశారు. అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవతో మేలుకొలుపు పాడారు. అనంతరం మూలవిరాట్లను పట్టు వస్త్రాలతో అలంకరించి ఆలయ ప్రధాన అర్చకుడు గూడ క్రిష్ణమాచార్య ఆధ్వర్యంలో అర్చకులు విశ్వక్‌సేన ఆరాధన, పుణ్యహావాచనం, అంకురార్పణ, దేవతాహ్వానం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు రంగురంగుల విద్యుద్దీపాలను, మైకులను ఏర్పాటు చేశారు. భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలను పూజించుకోవాలి

షాద్‌నగర్ రూరల్ : గ్రామస్తుల శ్రేయస్సు కోసం గ్రామ దేవతలను పూజించుకోవాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో గురువారం జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మనిషికి దైవ భక్తి ఉండాలన్నారు. దైవభక్తి ఉంటే సన్మార్గంలో నడుస్తారని, గ్రామస్తులు ఉమ్మడిగా కార్యక్రమాలు నిర్వహించుకుంటే ఐక్యత పెరుగుతుందన్నారు. అంతకుముందు బొడ్రాయికి పూజలు చేశారు. అలాగే ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ కావలి శ్రీశైలం, మాజీ సర్పంచ్ సాయి ప్రసాద్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మణ్ నాయక్, యాదయ్య తదితరులున్నారు.


షాద్‌నగర్ రూరల్ : బొడ్రాయి ప్రతిష్ఠాపనలో అంజయ్య యాదవ్, నాయకులు

రేపటి నుంచి కల్కిదోన గోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న చుక్కాపూర్ సమీపంలోని కల్కిదోన గుట్టపై వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ప్రతీయేటా ఫాల్గుణ శుద్ధ దశమి మొదలు త్రయోదశి వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈనెల 8నుంచి 13వరకు కొనసాగే ఉత్సవాల నేపథ్యంలో నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిద్దాంతి పట్టాభిరామ శర్మ, అర్చకుడు కృష్ణమూర్తి లు తెలిపారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

కడ్తాల్ : మండల పరిధిలోని రావిచెడ్ శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ఓ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షుడు కప్పెర ప్రసాద్, సినిమా డైరెక్టర్ కుమారస్వామి సాయితేజ్, రుద్రవీణ మాసపత్రిక ఎడిటర్ బాలసుబ్రమణ్యంలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పుట్టపాగ వెంకటక్రాంతి కిరణ్ కోరారు.


పశువులకు గర్భకోశ చికిత్స నిర్వహిస్తున్న డాక్టర్ స్ఫూర్తి, సిబ్బంది

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కొత్తూర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ స్ఫూర్తి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలోని కుమ్మరిగూడలో గురువారం పశువైద్యశిబిరం నిర్వహించి పశువులకు గర్భకోశవ్యాధుల చికిత్సలు, దూడలకు నట్టల నివారణ మందు వేయించారు. ఈ కార్యక్రమంలో వీఏఎస్‌లు డాక్టర్ శేఖర్, ముక్కంటి రాజ్, సిబ్బంది శ్రీలత, కృష్ణ, రవి, రాజు, బుచ్చిలింగం, పాడి రైతులు బండారి రామకృష్ణ, యాదయ్య, శ్రీరాములు, జైహింద్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు చేవెళ్లలో వైద్యశిబిరం

చేవెళ్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న చేవెళ్ల పట్టణ కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆసుపత్రిలో ఉచిత రొమ్ము, గర్భాశయ ముఖద్వారా (సర్వైకల్) క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించడం జరుగుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు చేసి పాటు మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. వైద్యశిబిరం ఉదయం 9గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు.

వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించొద్దు


చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించిన బైక్‌లు

చేవెళ్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించాలని, నెంబర్ ప్లేటు లేకుండా రోడ్లపై వాహనాలు డ్రైవ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల ఎస్సై సంతోష్ రెడ్డి తెలిపారు. గురువారం చేవెళ్ల పోలీస్‌ల ఆధ్వర్యంలో చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ చేవెళ్ల పట్టణ కేంద్రంలో నంబర్ ప్లేటు లేని వాహనాలు 20, రాంగ్ రూట్‌లో వెళ్లినవి 9, త్రిబుల్ రైడింగ్ 3, ట్రాఫిక్ వయెలేషన్‌కు పాల్పడుతున్న 32 వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి జరిమానాలు విధించారు. పోలీస్‌లు, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్ష ప్రశాంతం


ఆమనగల్లు : ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రం వద్ద విద్యార్థులు

ఆమనగల్లు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల నేపథ్యంలో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్షల షెడ్యూలు ప్రకారం ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. చాలావరకు విద్యార్థులు ఉదయం 8గంటలకే పరీక్షల కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద విద్యార్థులు గుంపులు గుంపులుగా కనిపించారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల పరిధిలోని 4 కళాశాలలకు చెందిన విద్యార్థుల కోసం ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తొలిరోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తెలుగు, సంస్కృతం పరీక్షకు 236 విద్యార్థులకు గాను 233 మంది హాజరుకాగా, ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెంట్ మాధవరావు, డీవో అనంత్ రెడ్డి లు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే చేవెళ్ల పట్టణ కేంద్రంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 245 మంది విద్యార్థులకుగాను 236 మంది పరీక్షకు హాజరయ్యారు. మోడల్ స్కూల్‌లో 328 మందికిగాను 317 మంది.. శ్రీచైతన్య కళాశాలలో 239 మంది విద్యార్థులకుగాను 231 మంది.. వివేకానంద కళాశాలలో 240 మందికి గాను 235 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

ఆమనగల్లు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులు ప్లాట్లు, లే అవుట్ల క్రమబద్ధీకరించుకోవానికి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు ఎంపీడీవో కుసుమ మాధురి కోరారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వెయ్యి రూపాయలు చెల్లించి ఎల్ఆర్ఎస్ కొరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్లాట్ల యజమానులు 25 శాతం రాయితీతో ఫీజు చెల్లించి అనధికారిక లేఅవుట్లలోని ప్లాట్లను రెగ్యులర్ చేసుకోవాలన్నారు. మార్చి 31వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఆమనగల్లు మండలంలోని 13గ్రామ పంచాయతీల ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆమనగల్లు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బీఆర్ఎస్ నాయకుడు గుమ్మకొండ సాయికిరణ్‌రెడ్డి కుటుంబాన్ని గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. సాయిరెడ్డి మృతిపట్ల సంతాపం తెలిపారు. తలకొండపల్లి మండలం చుక్కాపూర్‌లో నిర్వహించిన అంత్యక్రియల్లో నాయకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ.6వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్‌గౌడ్, నాయకులు ఉప్పల రాములు, భాస్కర్, శివకుమార్, రమేశ్ నాయక్, గణేశ్, నాగిళ్ల జగన్, వెంకటేశ్, యాదయ్య, గణేశ్ తదితరులు ఉన్నారు.

ఆడబిడ్డ పెళ్లికి చేయూత

కడ్తాల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండి గ్రామానికి చెందిన కేతావత్ అశ్విని వివాహానికి బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు రాందాస్ నాయక్ చేయూతనందించారు. గురువారం అశ్విని వివాహం నేపథ్యంలో రాందాస్‌నాయక్ రూ.10వేలు సమకూర్చి అందజేశారు. గ్రామంలో పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు చేయూతనందిస్తున్న రాందాస్‌ను పలువురు అభినందించారు. మాజీ ఎంపీటీసీ సక్రి, నాయకులు గోపాల్, కళ్యాణ్, సురేశ్, కిషన్, సిరాజ్ తదితరులు ఉన్నారు. అలాగే పేదింటి ఆడబిడ్డ పెళ్లికి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ చేయూతనందించారు. కడ్తాల మండలంలో ఏ ఇంట పేద ఆడబిడ్డ పెళ్లి జరిగిన రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దశరథ్ నాయక్ పెళ్లికానుక అందజేస్తున్నారు. అశ్వినికి దశరథ్ నాయక్ హాజరై వధూవరులను ఆశీర్వదించి పెళ్లికానుకగా రూ.21వేల నగదు, పట్టు చీరను బహూకరించారు. మాజీ సర్పంచ్ తులసీరామ్ నాయక్, మాజీ ఎంపీటీసీ సక్రి, తదితరులున్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, మార్చి6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని, ప్రభుత్వం స్పందించకపోతే రిలే దీక్షలను ఆమరణ నిరాహర దీక్షగా మారుస్తామని జేఏసీ నాయకులు అన్నారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం 125వ రోజుకు చేరాయి. సంఘీభావంగా నిరసన ర్యాలీ నిర్వహించారు.

● ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయంపై హర్షం

బీజేపీ నాయకుల సంబురాలు

కడ్తాల్/కొత్తూర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతు అభ్యర్థులు అంజిరెడ్డి, కొమరయ్యల విజయం పట్ల కడ్తాలలో గురువారం ఆ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు దోనాదుల మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మండల కేంద్రంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బీజేపీ జెండాలు చేబూని ర్యాలీ నిర్వహించారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. మోదీ, నడ్డా, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఆచారిలకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రత్యమ్నాయ శక్తిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఇక ఏ ఎన్నిక జరిగినా బీజేపీదే విజయమన్నారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం తప్పదన్నారు. బీజేపీని ఆదరించి గెలిపించిన ఆయా జిల్లాల పట్టభద్రులు, మేధావులు, ఉపాధ్యాయులు, గెలుపుకు శ్రమించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు భగీరథ్, రాందాస్ నాయక్, శంకర్‌నాయక్, రెడ్యానాయక్, శ్రీశైలం గౌడ్, సాయిలాల్, మన్యానాయక్, వెంకటేశ్, మునేశ్ నాయక్, కుమార్, మల్యానాయక్, కళ్యాణ్ నాయక్, రాజు, నాయక్, విక్రమ్, అశోక్, జగన్, శ్రీకాంత్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, రెండు ఎమ్మెల్సీలు బీజేపీ గెలుపొందడాన్ని హర్షిస్తూ బీజేపీ కొత్తూర్ మండల శాఖ అధ్యక్షుడు అత్తాపురం మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రానుందన్నారు. బీజేపీ నాయకులు రఘుపతిరెడ్డి, వనం శ్రీనివాస్, శ్రీధరచారి, శ్రీకాంత్‌నాయక్, హనుమంత్‌నాయక్, నవీన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు కాలం చెల్లిందని బీజేపీ కొందుర్గు మండలాధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. బీజేపీ నాయకులు లక్ష్మయ్యగౌడ్, శ్రీశైలం, బల్వంత్‌రెడ్డి, ప్రభులింగం అంజయ్య, సత్యనారాయణ, బోయ అశోక్, వెంకట్‌రెడ్డి, నరేష్, విక్రమ్, రాము, శివరాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం సాధించడం గొప్ప విషయమని ఆ పార్టీ చేవెళ్ల మండలాధ్యక్షుడు అత్తెల్లి అనంత రెడ్డి తెలిపారు. గురువారం చేవెళ్లలో విలేకరులో మాట్లాడుతూ బీజేపీపై నమ్మకంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించిన పట్టభద్రులు, ఉపాధ్యాయులకు, పార్టీ గెలుపు కోసం శ్రమించిన కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుతున్నట్లు చెప్పారు.


షాద్‌నగర్ అర్బన్ : బండి సంజయ్‌ని సన్మానిస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి పక్కన ఆచారి


కడ్తాల్ : విజయోత్సవ ర్యాలీలో బీజేపీ నాయకులు

తెలంగాణలో బీజేపీదే భవిష్యత్తు

షాద్‌నగర్ అర్బన్ : తెలంగాణలో బీజేపీకే భవిష్యత్తు ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఉత్తర తెలంగాణలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎమ్మెల్సీని బీజేపీ కైవసం చేసుకోవడానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కీలక పాత్రను పోషించారన్నారు. గురువారం బండి సంజయ్‌ని బీజేపీ నాయకుడు తల్లోజు ఆచారితో కలిసి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించినట్లు పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ ఘన విజయం సాధిస్తుందని శ్రీవర్ధన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ మద్దతు అభ్యర్థులు అంజిరెడ్డి, కొమరయ్యలను ఆచారి అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని.. అందుకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. బీజేపీ తెలంగాణలో ప్రత్యమ్నాయ శక్తిగా నిలుస్తుందన్నారు. బీజేపీ నాయకులు తిప్పిరెడ్డి రాంరెడ్డి, రవిరాథోడ్, ఎర్రవోలు శ్రీను, విక్రమ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.


కొత్తూర్ : సంబురాల్లో నాయకులు

సేవలతోనే జీవితానికి సార్థకత


రామును సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సమాజ సేవ, దాతృత్వం ద్వారా జీవితానికి సార్థకత చేకూరుతుందని ప్రముఖ సంఘసేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. ప్రతీ ఒక్కరు ఉన్నంతలో పరులకు సాయమందించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని కోరారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలకు చేయూతనందిస్తున్న పాపిశెట్టి రాముకు గురువారం తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీఎస్ఎస్‌వో రాష్ట్ర కో-ఆర్డినేటర్ కర్రె సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రామును పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. టీఎస్ఎస్‌వో రాష్ట్ర కన్వీనర్ మీసాల వంశీ, మహేశ్, ప్రముఖ ఫిలిం డ్యాన్సర్ ప్రభుశంకర్, తదితరులు పాల్గొన్నారు.